క్లుప్తంగా

నేడు మహేశ్వరానికి మంద కృష్ణమాదిగ

మహేశ్వరం: మండల కేంద్రంలోని పోతర్ల బాబయ్య ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించే ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరవుతారని జిల్లా ఇన్‌చార్జ్ రావుగళ్ల బాబు మాదిగ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా గురువారం 11కేవీ ఆదర్శనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందన్నారు.

మీర్‌పేట కమిషనర్‌గా వాణి



మీర్‌పేట: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా అల్లూరి వాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాగారం మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన ఆమె పదోన్నతిపై మీర్‌పేట కమిషనర్‌గా వచ్చారు. గతంలో ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన సిహెచ్.నాగేశ్వర్ బదిలీపై రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా వెళ్లారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వాణికి అధికారులు, సిబ్బంది, పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

మూడు రోజులుగా ముసురు

మహేశ్వరం: మండలంలో మూడు రోజులుగా ఏకధాటి ముసురు కురుస్తోంది. ఈ మేరకు బుధవారం మండలంలో 20.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని ఏఎస్ఓ విజయ తెలిపారు. భారీ వర్షాలు కురిస్తే రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రాజకీయ, సామాజిక అంశాలపై దృష్టి సారించాలి



మొక్కను బహూకరిస్తున్న నందులాల్

హస్తినాపురం: విద్యార్థులు కేవలం విద్యకే పరిమితం కాకుండా సామాజిక, రాజకీయ అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నందు ఆర్మీ వ్యవస్థాపకుడు నందులాల్ అన్నారు. హస్తినాపురంలోని రవీంద్రభారతి స్కూల్‌లో ఇన్వెస్టిట్యూర్ సెర్మనీని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన వివిధ విభాగాలకు ప్రతినిధులుగా ఎంపికైన విద్యార్థులకు బ్యాడ్జీలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మంగళగౌరి, డీఐ దయాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరామర్శ



మధుకర్‌ను పరామర్శిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: మాడ్గుల్ మండలం కొలుకుపల్లి గ్రామానికి చెందిన నాగిళ్ల మధుకర్ అనారోగ్యంతో బాధపడుతూ, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఉదయం ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి యువకుడి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి వైద్యులకు సూచించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుభాశ్, శేఖర్, సతీశ్, శివ తదితరులున్నారు.

బస్‌పాస్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలి



బస్‌పాస్‌లు అందజేస్తున్న సుచరిత

ఇబ్రహీంపట్నం: దివ్యాంగులకు ఆర్టీసీ కల్పిస్తున్న ఉచిత బస్‌పాస్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం సుచరిత అన్నారు. బుధవారం ఆమె ఇబ్రహీంపట్నం ఆర్టీసీ బస్టాండ్‌లో దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేశారు. ఈ సందర్భం డిప్యూటీ ఆర్ఎం మాట్లాడుతూ.. ఆర్టీసీ కల్పిస్తున్న దివ్యాంగులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకోవాలన్నారు. డిపో అసిస్టెంట్ మేనేజర్ సరస్వతి, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాడు డంపింగ్ యార్డు.. నేడు క్రీడా ప్రాంగణం

మైదానానికి మలిదశ ఉద్యమకారుడి పేరు

- యువత, కార్పొరేషన్ వాసులకు ఉపయోగపడేలా వసతుల కల్పన
- స్థానికుల్లో సంతోషం



సిరిపురం యాదయ్య(ఫైల్)

బడంగ్‌పేట్: మహేశ్వరం మండలం నాగారం గ్రామానికి చెందిన సిరిపురం యాదయ్య తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుగ్గా పాల్గొని రాష్ట్రం కోసం అమరుడయ్యాడు. దీంతో ఆయన స్ఫూర్తి ఎప్పటికీ గుర్తుండేలా నియోజకవర్గం పరిధిలోని బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని క్రీడా మైదానానికి ఆయన పేరు పెట్టారు. ఇందుకు విద్యాశాఖమంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని అధికారులను ఒప్పించారు. ఇందుకు ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బంది పడిన స్థానికులు

నాలుగున్నర ఎకరాల్లో విస్తరించిన ఈ మైదానం బడంగ్‌పేట నగర పంచాయితీగా ఉన్నప్పుడు స్థలాభావం కారణంగా ఇక్కడే చెత్త డంప్ చేసేవారు. క్రమంగా చెత్త పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఒక దశలో సొంతిళ్లు ఉన్నవారు సైతం ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోయారు. చెత్తకు నిప్పటించినపుడు ప్రయాణికులు, పలు కాలనీల వాసులు ఊపిరాడక తీవ్ర ఇబ్బందులు పడేవారు. డెంగీతో పలువురు చిన్నారులు మృత్యువాత పడ్డారు. చెత్త డంపింగ్ ఎత్తి వేయాలని అప్పటి కౌన్సిలర్ గుర్రం ప్రసన్న డంపింగ్ వద్ద ధర్నా చేపట్టారు. బడంగ్‌పేట కార్పొరేషన్ అప్‌గ్రేడ్ అయిన తర్వాత అధికారుల మీద ప్రజల ఒత్తిడి పెరగడంతో డంపింగ్ యార్డు ఖాళీ చేసేందుకు అధికారులు ఉపక్రమించారు. సబితాఇంద్రారెడ్డి ఎమ్మెల్యే అయిన వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి డంపింగ్ యార్డును తొలగించింది. డంపింగ్ యార్డు స్థలాన్ని క్రీడా మైదానానికి కేటాయించింది. నేడు ఈ మైదానం యువతకు ఎంతో ఉపయోగపడుతోంది.



యాదయ్య పేరుతో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం

రూ.3కోట్లతో అభివృద్ధి చేశాం



బడంగ్‌పేటకు వచ్చినప్పుడల్లా డంపింగ్‌యార్డుల పైనే ఫిర్యాదులు వచ్చేవి. కౌన్సిల్ మీటింగ్‌కు వచ్చినా. డంపింగ్ యార్డును ఎత్తివేయాలని వినతులు వచ్చేవి. ఉన్నతాధికారులతో మాట్లాడి డంపింగ్‌యార్డును బడంగ్‌పేట నుంచి జవహర్‌నగర్ తరలించేందుకు చర్యలు తీసుకున్నాం. డంపింగ్ యార్డు స్థలాన్ని క్రీడా మైదానానికి కేటాయించి రూ.3 కోట్లతో అభివృద్ధి చేశాం. అతిపెద్ద వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశాం. తెలంగాణ అమరుడు.. నియోజకర్గ ముద్దుబిడ్డ సిరిపురం యాదయ్య పేరును మైదానానికి పెట్టుకున్నాం. ఇప్పుడు దీన్ని వినియోగించేవారిని చూస్తుంటే సంతోషం కలుగుతుంది.

– సబితారెడ్డి, విద్యాశాఖ మంత్రి

నిధుల కేటాయింపుపై హర్షం



ఎంపీ రంజిత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొండల్ యాదవ్ తదితరులు

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ గ్రామ అభివృద్ధికి చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి నిధులు కేటాయించడం పట్ల స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. 13వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పందెం కొండల్ యాదవ్, 14వ వార్డు మజ్లిస్ నాయకుడు దస్తగిర్ బుధవారం ఎంపీని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలియజేశారు. ఎంపీ కేటాయించిన నిధులతో అంతర్గత బస్తీలలో సీసీ రోడ్లు వేయించామన్నారు. ఎంపీని కలిసిన వారిలో మాజీ సర్పంచ్ మేరాజ్‌ఖాన్, నాయకులు ఇ.సూర్యకుమార్ గౌడ్, సతీష్ కుమార్, ఈదులకంటి విశాల్ గౌడ్, మినాజ్, అమేర్, మహ్మద్ ఇస్మాయిల్ ఉన్నారు.

బాలల హక్కులకు రక్షణ కల్పించండి

టీఎస్ సీపీసీఆర్ ఛైర్మన్ శ్రీనివాస్

తుక్కుగూడ: బాలల హక్కులకు రక్షణ కల్పించాలని టీఎస్ సీపీసీఆర్ చైర్మన్ జె.శ్రీనివాస్ అన్నారు. బుధవారం వారు మున్సిపాలిటీ కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ (బాలుర), భాష్యం, రావిర్యాల ఆగాఖాన్ పాఠశాలను సందర్శించారు. ఈ పాఠశాలల్లో మౌలిక వసతులును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు రక్షణ చట్టాలు, బాలల పరిరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం పిల్లల రక్షణకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ కమిటీ సభ్యులు అంజన్‌రావు, మహేశ్వరం ఏంఈఓ కృష్ణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



తుక్కుగూడ జెడ్పీహెచ్ఎస్(బాలుర)లో అవగాహన కల్పిస్తున్న టీఎస్ సీపీసీఆర్ సభ్యులు

సీఎం వెంటనే స్పందించాలి

సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజ్

కందుకూరు: తమ సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె బుధవారంతో 14వ రోజుకు చేరింది. వర్షంలో సైతం సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ పంచాయతీ కార్మికులను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వారి సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. ఈ నెల 21న కలెక్టరేట్ ముట్టడి నిర్వహించనున్నామని ప్రతీ ఒక్కరు హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, కార్మికులు బాల్‌రాజ్‌గౌడ్, మహేశ్, దశరథ, యాదయ్య, శ్రీధర్, ముత్యాలు, వెంకటయ్య, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికుల ఆందోళన

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన బంగారుగడ్డ జంగయ్య కొంత కాలంగా లివర్ వ్యాధితో బాధ పడుతున్నాడు. ఆయన ఆర్థికంగా ఇబ్బందిగా ఉండడంతో వైద్య పరీక్షలకు దూరంగా ఉన్నాడు. విషయం తెలుసుకున్న ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి జంగయ్యను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. ఆయన ఆస్పత్రి ఖర్చులకు సహకారం అందిస్తామని చెప్పారు. ఈ మేరకు ఆయన బుధవారం ఫౌండేషన్ సభ్యులచే రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాండు, నరేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శివ కుమార్‌గౌడ్, డేవిడ్, కిషన్, ప్రశాంత్‌రెడ్డి, నరసింహ, భరత్, శ్రీను, జనార్దన్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.5వేలు

కడ్తాల్: ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామానికి చెందిన మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఐక్యత ఫౌండేషన్ సభ్యులు బుధవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నేత రాఘవేందర్‌రెడ్డి అందజేసిన రూ.5 వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీరాములు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పంతునాయక్, ఉప సర్పంచ్ మల్లేశ్, రవి, నారయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

నాగిళ్లలో 'ఉప్పల' సభ్యులు

కడ్తాల్: మాడ్గుల మండలం నాగిళ్ల గ్రామానికి చెందిన సురమళ్ల అంజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు బుధవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అందజేసిన రూ.3వేలు కుటుంబ సభ్యులకు ఇచ్చారు. కార్యక్రమంలో మహేశ్, రాధాకృష్ణ, రాములు, యాదయ్య, లింగం, మహేందర్ తదితరులున్నారు.

కుల సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడిగా పరమేశ్

తుర్కయంజాల్: బీసీ కుల సంఘాల ఐక్యవేదిక మున్సిపల్ అధ్యక్షుడిగా మునగపాటి పరమేష్ నేతను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాటం నరసింహయాదవ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం పరమేశ్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జాతీయ సంచార జాతుల కమిషన్ సభ్యుడు నరసింహ, జిల్లా అధ్యక్షుడు అంజయ్య గౌడ్, బీసీ కుల సంఘాల రాష్ట్ర నాయకుడు కటికం నరసింగరావు, ప్రధాన కార్యదర్శులు గుండ్ల ఆంజనేయులుగౌడ్, శంకర్ ప్రజాపతి, దావా శ్రీనివాస్, నాయకులు రాజుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యను పరిష్కరించిన యువకుడు

సొంత ఖర్చుతో తాగునీటి వసతి కల్పన



తాగునీటి సమస్యను పరిష్కరించిన మిత్రబృందం

కందుకూరు: తాగునీటి సమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఓ యువకుడు సొంత ఖర్చులతో సమస్యను పరిష్కరించి ఆదర్శంగా నిలిచాడు. మండల పరిధిలోని కటికపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఒకే ఆవరణంలో కొనసాగుతున్నాయి. కాగా అక్కడి విద్యార్థులకు తాగునీటి సమస్య ఏర్పడింది. దీంతో విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన నూకం నరేశ్ రూ.10 వేలు వెచ్చించి స్నేహితులు దినేశ్, శేఖర్, బన్నీ, రమేశ్, వెంకటేశ్ తదితరుల సాయంతో పైప్‌లైన్ ఏర్పాటు చేసి విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాడు. దీంతో అతన్ని ఉపాధ్యాయులు శివలీల, రజిత, గ్రామస్తులు అభినందించారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో దివ్యాంగుల కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎల్‌బీనగర్‌లోని క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం నియోజకవర్గం పరిధిలోని దివ్యాంగులు, అధికారులతో కలిసి ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ఇప్పటికే రూ.3016 ఉన్న పింఛన్‌ను రూ.4016 చేశారని తెలిపారు.డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ ఉందని, మొదట వారికి ఇచ్చిన తర్వాతే మిగతా వారికి ఇవ్వాలని ఆయన అధికారులను కోరారు. దివ్యాంగుల్లో దళితులు ఉంటే వెంటనే దళితబంధుకు దరఖాస్తు చేసుకోవాలని, వారికి పథకం వర్తింపజేసేలా చర్యలు తీసుంటానని తెలిపారు. 2016 చట్టం ప్రకారం దివ్యాంగులకు రావాల్సిన కోటాను తన నియోజకవర్గంలో అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే చెప్పారు. సంక్షేమ పథకాలతో పాటు నామినేటెడ్ పోస్టుల్లో కూడా వారికి న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటానన్నారు. త్వరలో సంబంధిత అధికారులతో కలిసి వర్క్ షాప్ నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు రాజేశ్వర్‌రెడ్డి, విక్రాంత్, రాజేష్, బలరాం, అశ్వినికుమారి, హయత్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లు, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు మద్దెల గంగారాం, నాగభుషన్, రాంబాబు, నాగేశ్వరరావు, నాగరాజు, రామచందర్, వేణు, కోటి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

అగ్రి లీగల్ సర్వీసెస్ అథారిటీ కో ఆర్డినేటర్ బాల్‌రెడ్డి

కడ్తాల్: వ్యవసాయ న్యాయ సలహాకేంద్రాల ద్వారా రైతులకు న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అగ్రి లీగల్ సర్వీసెస్ అథారిటీ కో ఆర్డినేటర్ బాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆమనగల్లు పట్టణంలోని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులు న్యాయపరమైన సమస్యలపై కోఆర్డినేటర్ బాల్‌రెడ్డికి దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాణి రైతులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న బాల్‌రెడ్డి

వివాహిత హత్య కేసులో నిందితుడికి జైలు

రంగారెడ్డి కోర్టులు: మహేశ్వరం ఠాణా పరిధిలో 2014లో నమోదైన వివాహిత దోషపూరిత హత్య కేసులో నిందితుడు ఐల వెంకటేశ్ గౌడ్(38)కు రంగారెడ్డి జిల్లా 11వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 10 వేలు జరిమానా విధించారు. ఏపీపీ వి. రవికుమార్ కథనం ప్రకారం... వెంకట రామయ్య అనే లారీ డ్రైవర్ తెల్లరాయి లోడ్‌తో మహేశ్వరం మీదుగా షాద్‌నగర్ నుంచి చెన్నై బయలుదేరాడు. మహేశ్వరం గ్రామం దాటాక సుమారు రాత్రి 8 గంటలకు ఒక జంట రోడ్డు పక్కన నిలబడి గొడవపడుతోంది. ఇది గమనించిన డ్రైవర్ లారీని నెమ్మదిగా పోనిచ్చాడు. ఇంతలో మహిళతో గొడవపడుతున్న వ్యక్తి ఆమెను చేతితో గట్టిగా కొట్టడంతో ఆమె లారీ చక్రాల కిందపడింది. కాగా, మహిళ లారీ కింద పడిన విషయాన్ని గమనించి తాను లారీని ఆపేలోపే వెనుక చక్రాలు ఆమెపై ఎక్కేయడంతో మరణించిందని, మహిళ మృతికి కారణమైన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లారీ డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు. విచారణలో మృతురాలు కేతావత్ దేవిగా నిర్ధారించుకున్నారు. నిందితుడు ఐల వెంకటేశ్ గౌడ్‌ను రిమాండ్‌కు తరలించి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి వై.జయప్రసాద్ నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వినతి



విద్యుత్ సమస్యలను ఏడీఈకి వివరిస్తున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శివారు కాలనీల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని బుధవారం కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి వనస్థలిపురం ఏడీఈ రాంచంద్రయ్యను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ, డివిజన్‌లో శివారు కాలనీల్లో విద్యుత్ సమస్యలతో కాలనీల వాసులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పలు ప్రాంతాలలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు సబ్‌స్టేషన్ కూడా అవసరం ఉందన్నారు. వెంటనే ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన కోరారు.

నులిపురుగుల నివారణ మాత్రలు వేయించండి

డాక్టర్ పరిక్షిత్ నరేందర్

కడ్తాల్: ఏడాది వయస్సు నుంచి 19ఏళ్ల లోపు బాల బాలికలకు తప్పనిసరిగా నులిపురుగు నివారణ మాత్రలు వేయించాలని డాక్టర్ పరిక్షిత్ నరేందర్ సూచించారు. గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఏఎన్ఎం, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలతో ఆమనగల్లు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

'నల్సా'తో ప్రజలకు సమన్యాయం

సీనియర్ సివిల్ జడ్జి ఇందిర

హయత్‌నగర్: అందరికీ సమాన న్యాయం అందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు(నల్సా) ఉచిత న్యాయ సేవలు అందిస్తాయని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఇందిర అన్నారు. బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్ ఎంపీడీఓ కార్యాలయంలో నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ(నల్సా) అందజేస్తున్న అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ద్వారా పేద ప్రజలు, ఒంటరి మహిళలు, నిరక్షరాస్యులు ఆర్థికంగా వెనకబడిన వారికి ఉచిత న్యాయ సలహా లభిస్తుందని, ఉచితంగా సేవలు అందుతాయనే విషయం అందరికీ వివరించాలన్నారు. సమాజంలో అక్రమ రవాణాకు గురైన బాధితుల కోసం, బాలల హక్కులను పరిరక్షణకు, బాల కార్మిక బాధితుల కోసం, మానసిక, శారీరక వైకల్యం ఉన్నవారికి, లైంగిక వేధింపులకు గురైన బాధితుల కోసం, వేధింపులకు గురవుతున్న సీనియర్ సిటిజన్స్ కోసం, యాసిడ్ దాడులకు గురైన బాధితులకోసం, మానవ హక్కులను కోల్పోతున్న బాధితులకు నల్సా న్యాయం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి, ప్రభాకర్, ఎంపీడీఓ మమతాభాయి, జిల్లా సహాయ అధికారి పద్మజ, హయత్‌నగర్ బార్ అసోషియేషన్ అధ్యక్షులు వేణుగోపాల్,, సఖి కో ఆర్డినేటర్ మంజుల, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఆంజనేయులు, న్యాయవాదులు రామ్మోహన్, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఇందిర

ఎడతెరిపి లేని వర్షాలతో అవస్థలు

- కాలనీల్లో పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు
- పలుచోట్ల స్తంభించిన ట్రాఫిక్

దిల్‌సుఖ్‌నగర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మలక్‌పేటజోన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీలు జలమయం అయ్యాయి. వర్షం నీరు కాలనీల్లోని డ్రైనేజీలు పొంగి మురుగు రహదారులపై ప్రవహించింది. ఫలితంగా దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట, మూసారంబాగ్ చౌరస్తా, నల్గొండ క్రాస్‌రోడ్డుల్లో ట్రాఫిక్ స్తంభించింది. అంతటా ప్రధాన రహదారులు జలమయంగా మారాయి. వర్షానికి జోన్‌పరిధిలోని అల్కాపురి, మార్గదర్శికాలనీ, టెలిఫోన్‌కాలనీ, దిల్‌సుఖ్‌నగర్, శంకేశ్వరబజార్, అక్బర్‌బాగ్, ఓల్డ్‌మలక్‌పేట్, అజంపుర, సైదాబాద్, సరూర్‌నగర్, ఆర్‌కేపురం, ఐఎస్‌సదన్, కొత్తపేట తదితర ప్రాంతాలు జలమయంగా మారాయి. కొన్ని కాలనీల్లో విద్యుత్ నిలిచిపోయింది. కురుస్తున్న వర్షానికి ముంపు ప్రాంతాల ప్రజలు ఆందోళనకు గురయ్యారు. కాలనీల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురైన వెంటనే కాలనీవాసులు జీహెచ్ఎంసీ అధికారులకు ఫోన్ చేయాలని, అందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.



ఆర్‌కేపురం ప్రవహిస్తున్న వర్షపునీరు